# కథ చెప్పిన కెరటం

—మేకీ నారాయణ





V-4

గడియారానికి యింకోమారు 'కీ' ఇచ్చాడు కల్యాణరావు.

"అయినా సరే నేను నడవడం ఈ జన్మకు జరగదు"—అన్నట్టు భీష్మించుకు కూర్చుంది గడియారం. దాన్ని విసిరి వీధిలోకి గిరవాటు వేయాలనిపించినా బలవంతాన కోపాన్ని అణచుకొని పక్కన అస్తవ్యస్తంగా పడివున్న పుస్తకాల మీదికి విసురుగా పడవేశాడు కల్యాణరావు.

గంటసేపట్నుంచి మెల్లమెల్లగా పరామర్శిస్తున్న తలనొప్పి ఒక్కసారిగా ఎక్కువయినట్టనిపించింది. భారంగా కణతలు రుద్దుకుంటూ కుర్చీ వెనకకోడు మీద తలవాల్చి ఆలోచించసాగాడు.

ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

ఏ రెండింటికీ సంబంధం లేదు.

ప్రశ్నలు మస్తిష్కాన్ని తొలిచి వేస్తున్నాయి. వేలకు వేలు మొండి కత్తుల్లా మారిపోయి పనికట్టుకున్నట్లు మెదడును నరుకుతున్నాయి.

ఒక్కమారు గట్టిగా తల విదిలించి పైకిలేచి, కూజాలోవున్న చల్లని నీళ్లతో ముఖం తుడుచుకున్నాడు కల్యాణరావు.

కాస్త తేలిక పడినట్టనిపించింది. సిగరెట్టు వెలిగించి తీగల్లా పైకి సాగుతున్న పొగవైపు నిర్నిమేషంగా చూడసాగాడు.

టైము అయిదయిందేమో! నలుగురైదుగురు ట్యూషన్‌కోసం వచ్చే పిల్లలు జారిపోతున్న పుస్తకాల్ని సర్దుకుంటూ గుమ్మంలోకి వచ్చి నిలబడ్డారు.

ఎప్పుడూ హుషారుగా వుంటూ కథ చెబుతున్నట్టే పాఠాలు చెప్పే మాష్టారు ఈ రోజు ఎందుకింత గంభీరంగా వున్నాడో తేల్చుకోలేక పోయారు పిల్లలు. గట్టిగా మాట్లాడినా విసుక్కుంటాడేమోనని భయపడి, గుసగుసలు పోతూ పుస్తకాలు తిరగెయ్యసాగారు.

అర్ధగంట గడిచేసరికి ట్యూషన్‌కు రావాల్సిన అందరూ వచ్చేశారు.

కల్యాణరావు కళ్లు యింకా గుమ్మంవైపే ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు వున్నాయి.

రెండు గంటలు ఎలా గడిచి పోయాయో కల్యాణరావుకు గుర్తు లేదు. పాఠాలూ, హోమ్ వర్కూ బెడదలేకపోవడం వల్ల కులాసాగా కబుర్లు చెప్పుకున్న పిల్లలు మాత్రం టైం కాగానే "సార్!

వెళతాం'' అంటూ పైకి లేచారు.

ఉలిక్కిపడ్డట్టయి ఆలోచనల్లోంచి తేరుకున్న కల్యాణరావుకు తనమీద తనకే అసహ్యం వేసింది —రెండు గంటలసేపు ఏమీ చెప్పకుండా అందర్నీ ఊరకేకూర్చోబెట్టినందుకు.

వెళ్లమన్నట్లు తల ఊపుతూ, "నాకీ రోజు ఒంట్లో బాగాలేదు. పాఠాలేమీ చెప్పనిది అందుకే. రేపు మామూలు వేళకే వచ్చేయండి పాఠాలు చెబుతాను,'' అన్నాడు.

నాలుగు గోడలచేత ఆవరింపబడిన గది మళ్లీ కల్యాణరావును ఆలోచనలతోబాటు గాఢంగా కౌగిలించుకొంది.

కల్యాణరావు ఆలోచనలు కొన్ని రోజులు వెనక్కి నడిచి కొన్ని సంఘటనల్ని ముందుకు తీసుకొచ్చాయి.

* * *

ఆ రోజు—

కల్యాణరావు దగ్గర కాఫీకి కూడా చిల్లరడబ్బులు లేవు. రెండు మూడు రోజులు గడిచిన తర్వాత గానీ ట్యూషన్ పిల్లలు డబ్బులు తీసుకొచ్చే అవకాశం కూడా లేదు.

కనీసం అయిదు రూపాయలైనా ఎవరిదగ్గరన్నా తీసుకుంటే బాగుంటుంది అవి మగనపడేరోజు.




—ఆవిడొచ్చింది తన కూతురికి ట్యూషన్ చెప్పమంటూ.

విషయం చెప్పిం తర్వాత ఆవిడ మొదటి డైలాగు—"మాలాంటి వాళ్లకు సహాయంచేస్తే మీకు పుణ్యం వస్తుంది."

ఆ సమయంలో కల్యాణరావు పుణ్యంతో విపరీతమైన అవసరం వచ్చిపడి. యిబ్బంది పడిపోవడం లేదు. ఎక్జాట్‌గా చెప్పాలంటే అతనికి కావాల్సింది "అయిదు రూపాయలు'' మాత్రమే! తను పదిహేను రూపాయలు అంటే ఆవిడ 'పది'—అనడంతో అడ్వాన్సుగా ఐదురూపాయలు అడిగే అవకాశం కూడా లేదనిపించింది.

అందుకే అంత ఖరాఖండిగా ఏడో తరగతి అమ్మాయికి పది రూపాయల్లో ట్యూషన్ చెప్పే ప్రసక్తే లేదు పొమ్మన్నాడు.

ఆవిడ వెనుక, కొంచెం ప్రక్కగా నిలబడి ఉన్న ఆమె —'ఆమె'అని అనాల్సిన అవసరం

## కథ చెప్పిన కెరటం




లేదు. 'అమ్మాయి' అంటేచాలు— కళ్ళు చిట్లించి చూపింది కల్యాణరావు వైపు.


కల్యాణరావుకు వ్యవహారం తొందరగా తెగిపోతే బాగుండునని పిస్తోంది. కానీ అది తెగడంలేదు.

ఇంకోమారు చెప్పాడు. "ఇప్పటికే బోలెడంత మంది నేనడిగినంత యిస్తూ ట్యూషన్‌కు వస్తున్నారు. మీకని క్రొత్తగా ఏమీ పదిహేను రూపాయలని చెప్పడం లేదు. -అదైనా అడ్వాన్సుగా ఈ రోజే అయిదు రూపాయలు ఇవ్వాల్సి వుంటుంది" అన్నాడు.

ఆవిడ యిక బ్రతిమాలుకున్నా లాభం లేదనుకుందేమో! తల పంకిస్తూ-"మీ యిష్టం బాబుగారూ! సాయంత్రం అమ్మాయిని ట్యూషనుకు పంపేటప్పుడు, అయిదు రూపాయలు యిచ్చి పంపిస్తాను. తీసుకోండి. కానీ మీరు....కనీసం పన్నెండు రూపాయలకైనా ఒప్పుకొని...." మిగతా మాటల్ని మ్రింగుతూ పూర్తి చేసింది.

కల్యాణరావు పన్నెండుకు కాదు, ఐదురూపాయలకైనా ఒప్పుకొంటాడు. అయితే అతని కండిషన్ ఆ అయిదూ తక్షణమే చేతి





లోకి రావాలి. అదీ పడేటట్టు లేదు. ఎలా?- ఆలోచించాడు.

మెరుపులా ఏదో గుర్తుకొచ్చి "ఇప్పుడు టైమెంతయి వుంటుంది?" అడిగాడు.

"మూడున్నర దాటిందేమో!"

"ట్యూషన్ మొదలు పెట్టేది నాలుగు గంటలకే! అమ్మాయిని తీసుకెళ్ళి వెంటనే పంపించేయండి. ఆ అడ్వాన్సు కూడా కాస్త మరిచి పోకుండా పంపించండి."

ఆవిడ తల ఊపింది. "అలాగే! పది నిమిషాల్లో పంపిస్తాను."

ఆవిడింకా అక్కడే నసుగుతూ కాలయాపన చేయడం కల్యాణ రావుకు నచ్చడం లేదు. సాధ్యమైనంత తొందరగా....వీలైతే




పరుగెత్తికెళ్లి ఆ అమ్మాయిని ఐదు రూపాయల్తోబాటు పంపించాలని వుంది.

ఆఖరుకు.... యింకో మారు వెళ్ళొస్తానని చెప్పి ఆవిడ వెనక్కు తిరిగింది. ప్రక్కన నిలబడ్డ అమ్మాయి యింకోమారు కళ్ళు చిట్లించి చూస్తూ ముందుకు నడుస్తోందో వెనక్కు నడుస్తోందో చెప్పటానికి వీల్లేదన్నట్లు ప్రక్కకు అడుగుపెట్టింది...

# కథ చెప్పిన కెరటం



“నీ పేరేమిటి?” కల్యాణరావు అడిగాడు.

ఆ అమ్మాయి, మళ్లీ కళ్ళు చిట్లించి చూస్తూ “యశోద” అంది.

ఐదు రూపాయలు తొందరగా కావాలన్న విషయం గుర్తుకొచ్చి యింకా అడగదల్చుకున్న ప్రశ్నలన్నింటినీ వెనక్కి నెట్టాడు కల్యాణరావు. వెళుతున్న ఆ యిద్దరి వైపూ స్తబ్దంగా చూడసాగాడు.

వాళ్లలా మెల్లగా తన కివ్వాల్సిన ఐదు రూపాయల సంగతి మరచి పోయినట్టు నత్త నడకలు నడుచుకొంటూ వెళ్లడం కల్యాణరావుకు నచ్చకపోయినా చేసేదేమీ లేక చూస్తూ నిలబడ్డాడు.

అర్ధగంట తర్వాత పుస్తకాలు రొమ్ముకానించుకొని ఆయాసంతో వగరుస్తూ ఆ అమ్మాయి గుమ్మం దగ్గరకి వచ్చేరాక మునుపే అడిగాడు కల్యాణరావు “డబ్బు తెచ్చావా?” అని.

“మా అమ్మ రేపు తప్పకుండా పంపిస్తానని చెప్పమంది” వగరుస్తూనే చెప్పింది.

తల తిరిగిపోయింది కల్యాణరావుకు. ఆ ఐదు రూపాయల మీద చాలా ఆశలు పెట్టుకొన్నాడు. -‘ఇహ ఈ రాత్రి గడవదు’తనలో తనే గొణుక్కొన్నాడు.

“లోపలికి రమ్మన్నారా?” ఆ అమ్మాయి డబ్బు తేలేదని చెప్పడం వల్ల వెనక్కి వెళ్లిపొమ్మంటాడేమోనని అనుమానంగా అడిగింది.

“రా” కణతలు రుద్దుకుంటూ అన్నాడు కల్యాణరావు.

ఆ అమ్మాయి లోపలికి అడుగుపెట్టి గదంతా కలయజూసి “ఎవ్వరూ లేరే! నాకొక్కదానికే పాఠం చెబుతారా?” అంది.

“ఎవరూ లేకపోతే మాత్రమేం? నిన్నెవరూ యిక్కడ్నుంచి ఎత్తుకపోరుగానీ కూర్చో” విసుగ్గా అన్నాడు కల్యాణరావు. ఆ మాటలు వింటూంటే కొట్టను కూడా కొడతాడేమో అని అనిపించిందేమో ఆ అమ్మాయికి- ఠకీమని కూర్చొంది.

జాలేసింది కల్యాణరావుకు. నొచ్చుకుంటూ “మీనాన్న గారేం చేస్తారు?” అని అడిగాడు.

"నాకు తెలీదు"

"ఉద్యోగమేనా?"

"ఏమో!"

"మీ అమ్మ?"

"ఇంట్లో ఉంటుంది. సామాన్లు కొనుక్కు రావడానికి బజారు క్కూడా వెళుతుంది."

కల్యాణరావుకు మళ్లీ కోప మొచ్చింది "ఎన్నో తరగతేడుస్తున్నావ్?"

"ఏడు"

"బియ్యే చదువుతున్నా వనుకొన్నాను."

"అదీ యింకా చా....నా.... ఏళ్లకు చదువుతాను. మా అమ్మ చెప్పింది నేను కలెక్టరునవుతానట"

ఎగిరి పడ్డాడు కల్యాణరావు. "ఏడో తరగతి చదువుతున్నావ్. మీ నాన్న ఏం ఉద్యోగం చేస్తున్నాడో తెలీదు గానీ కలెక్టరవుతావా కలెక్టరు" మండి పడ్డాడు.

"మా నాన్న అసలు ఉంటేగా ఏం చేస్తున్నాడో చెప్పడానికి."

కల్యాణరావు ముందుకు వంగి ప్రశ్నించాడు. "ఎక్కడికెళ్ళాడు?"

"అమెరికాకు వెళ్ళిపోయాట్ట... నేనెప్పుడూ ఆయన్ను చూణ్ణేలేదు, సార్! అమెరికా ఎక్కడుంటుంది సార్? వెయ్యి మైళ్ళుంటుందా?




కల్యాణరావు సమాధానం చెప్పకుండా ఆలోచించసాగాడు, ఆమె ఎలాంటిది? భర్తలేదని యశోద మాటల వల్ల తెలుస్తోంది.. మరి సంసారాన్నెలా గడుపుతోంది..? ఉద్యోగం చేసేటట్టులేదు... కల్యాణరావుకు రెండు మూడు సమాధానాలు దొరికాయి.

ఆలోచనల్ని అవతలికి నెట్టుతూ సరాసరి తన పరిస్థితిలోకి వచ్చాడు.

"ఇంతకూ రేపు మీఅమ్మ డబ్బు పంపిస్తుందంటావా" అడిగాడు.

"ఏమో. పంపితే పంపొచ్చు లేకపోతే తర్వాత యిస్తానంటుందేమో"-కల్యాణరావుకు ఆసమాధానం మండుకొచ్చినా గత్యంతరం లేక "చూడు యశోదా!ఏడో తరగతి చదువుకొనే వాళ్ళు ట్యూషన్ ఫీజు ఎంతిస్తారో తెలుసా?" అన్నాడు

'తెలీదు' ఆ అమ్మాయి బుద్ధిగా సమాధాన మిచ్చింది.

"ఇరవై రూపాయలు" నొక్కి చెప్పాడు కల్యాణరావు.

# కథ చెప్పిన కెరటం



"అలాగా"- అంతేనా అన్నట్టు అంది.

"మీ అమ్మ ఎంతిస్తానన్నదో తెలుసా?"

"తెలీదు"

"ఎందుకు తెలీదు - అప్పుడే నువ్వా వచ్చావుగా"

"నేను వినలేదు!"కళ్ళుచిట్లిస్తూ చెప్పింది యశోద.

కల్యాణరావు యిక ఆ అమ్మాయితో మాట్లాడి లాభం లేదనుకొన్నాడు. కుర్చీలో వెనక్కువాలి రాత్రి ఎలా గడుస్తుందా అని కళ్ళు మూసుకుని ఆలోచించసాగాడు.

"సార్! నాకు భయంగా ఉంది" యశోద అంది.

కళ్ళు తెరిచి యశోద వైపు చూశాడు కల్యాణరావు!

"ఎవ్వరూ లేరు. నేనొక్కదాన్నే యిక్కడ కూర్చోవాలంటే...."

"ఒక్కదాన్నే అంటావేమిటి? నేను లేనూ..."

"మీరు మగవాళ్ళు"

అర్ధ అడుగు పైకి ఎగిరి పడ్డాడు కల్యాణరావు.

"నీకెవరు చెప్పారు యివన్నీ"

"మీరు మగవాళ్లన్నదా....నాకే తెలుసు"

తల పట్టుకున్నాడు కల్యాణరావు. "అసలు నీకెందుకు భయంగా ఉందో చెప్పు"

"ఒంటరిగా మగపిల్లల్తో ఉండకూడదని అమ్మ చెప్పింది"


"నేను నీకు టీచర్ని. తెలిసిందా?"

"అయినా మీరూ మగాళ్ళేకదా"

కల్యాణరావు గబగబా పైకి లేచి ఆ అమ్మాయి రెక్కపట్టుకొని గుమ్మందాకా లాక్కెళ్ళి "ఇంటికెళ్ళి మీ అమ్మ దగ్గర చదువుకో! ఇక్కడికి రావద్దు" అన్నాడు.

ఆ అమ్మాయికి ఏడుపొక్కటే మిగిలింది. "సార్... నేనిక్కడే చదువుకొంటాను సార్... ఇంకెప్పుడూ భయంగా ఉందని చెప్పను సార్" దీర్ఘం తీస్తూ చెప్పింది.

కల్యాణరావు ఆ అమ్మాయిని వదిలిపెట్టేశాడు. యశోద తను పుస్తకాలు పెట్టినచోటికి చిన్నగా నడుచుకెళ్ళి కూర్చొని "రేపొచ్చేటప్పుడు తప్పకుండా డబ్బు తెస్తాను సార్" అంది.




నవ్వొచ్చింది కల్యాణరావుకు "సరేలే! కూర్చొని ఆ పుస్తకాలెత్తి చదువ్... మిగతావాళ్ళు రాగానే పాఠం చెబుతాను" అన్నాడు.

"వాళ్ళెప్పుడొస్తారు సార్?" యశోద ఆ ప్రశ్న అడిగి నాలుక కరుచుకొంది.

కల్యాణరావు చెప్పాడు "సరిగ్గా అయిదు గంటలకు వస్తారు. నువ్వు కూడా అదే వేళకి రావాలి!"

తల ఊపింది ఆ అమ్మాయి.

* * *

ఆవిడ....అంటే యశోద అమ్మ పది రోజుల తర్వాత ఓ సాయంత్రం బజార్లో వెళుతుంటే కనిపించింది కల్యాణరావుకు.

ఆవిడే మొదట నమస్కారం చేస్తూ పలుకరించింది 'బాగున్నారా' అంటూ.




కల్యాణరావు సమాధానంగా చిరునవ్వు నవ్వాడు! ఆ రోజు ఆమెను అయిదు రూపాయల కోసం వత్తిడి చెయ్యడం గుర్తుకొచ్చి సిగ్గుపడ్డాడు.

"మా యిల్లు యిక్కడే ఒక మారు వస్తారా... మీకేమైనా అర్జెంటు పనులుంటే..."

"ఏమీ లేవు. పదండి వస్తాను" ఆమెతోబాటు ప్రక్కకు తిరిగాడు కల్యాణరావు.

# కథ చెప్పిన కెరటం



"యశోద బాగా చదువుతోందా"

"ఊ...."

"అదొక్కటే ఉందండీ నా ఆశ.... ఏం చేస్తుందో ఏమో" తనలో తను అనుకొంటున్నట్టు గొణిగింది ఆమె.

ఒక పెంకుటింట్లోకి తాళం తీసి లోపలికెళ్లింది ఆమె. కల్యాణరావు అనుసరించాడు. రంగు తెలీకుండా మాసిపోయిన చాపను నేల మీద పరుస్తూ "కూర్చోండి" అంది. కల్యాణరావు కూర్చున్నాడు.

ఇల్లంతా ఒకే గది. వంటకు కూడా సెపరేట్‌గా ఏమీలేదు. ఒక మూలగా పొయ్యి.కొన్ని పాత్రలూ కట్టెలూ ఉన్నాయి.

ఆమె పొయ్యి ముట్టించడానికి కట్టెలు పెట్టి కిరసనాయిల్ పోసి అంటించింది.

"పొయ్యి వెలిగిస్తున్నట్టున్నారు. కాఫీ గీఫీ అలాంటి వాటి కోసమైతే వద్దు" అన్నాడు కల్యాణరావు.

"ఎందుకని?" ఆమె తన పని చూసుకొంటూనే అంది.

"నేనిప్పుడే త్రాగొచ్చాను"

"కాఫీ లెక్కడ కడుపు నింపుతాయిలెండి.... నిజం చెప్పాలంటే నాకు యశోద తర్వాత మీరే ఆప్తులు. మీకామాత్రం మర్యాదైనా చెయ్యకపోతే ఎలా"

విచిత్రంగా చూశాడు కల్యాణరావు. "నాదేముందండీ మీ అమ్మాయికి టీచర్ని.అంతేగా!" అన్నాడు.

"ఆ మాత్రం సంబంధం ఉన్నవాళ్ళు కూడా లేరు" ఆమె తొణక్కుండా సమాధానమిచ్చింది. కల్యాణరావు మాట్లాడకుండా ఆమె కాఫీ పెట్టడం చూడసాగాడు.

రెండు ఇత్తడి గ్లాసుల్లో కాఫీ పోసి తీసుకొచ్చింది ఆమె. గ్లాసు అందుకొంటూ అడిగాడు కల్యాణరావు "యశోద స్కూల్ నుండి యింకా రాలేదా" అని.

ఆమె జవాబివ్వకుండా యింకో ప్రశ్న వేసింది కల్యాణరావును. "మీ దగ్గరికి ట్యూషన్‌కు వచ్చే వాళ్లలో అబ్బాయి లెంతమంది?"

"ఏడెనిమిదిమందనుకొంటా!"

"అందరూ పెద్దవాళ్ళేనా?"

"పెద్దవాళ్ళంటే?" ఎదురు ప్రశ్న వేశాడు కల్యాణరావు.

ఆమెకీ ప్రసంగం యిష్టం లేనట్టు స్పష్టంగా తెలుస్తోంది. కానీ విధి లేనట్టు చెప్పసాగింది "మీరే మనుకోరనే ధైర్యంతో చెబుతున్నాను...." అంటూ ఒక నిమిషం ఆగి ఏదో నిశ్చయించుకొన్నట్టు "అది చిన్న పిల్లేమీ కాదు....పధ్నాలుగేళ్లు వెళ్ళిపోయి పదిహేనో ఏడు నడుస్తోంది. అది తొందరగా చెడిపోతుందేమోనని నా భయం...." కష్టంగా పూర్తి చేసింది ఆమె.

"అలా ఎందుకనుకొంటున్నారు," కల్యాణరావుకు కూడా ప్రశ్నలడగడం సమాధానాలు చెప్పించుకోవడం యిబ్బందిగానే ఉంది.

"అదంతే! అది పుట్టక ముందే నాకు తెలుసు"

ఆశ్చర్యంగా చూశాడు కల్యాణరావు ఆమె వైపు.

"వాళ్ళ నాన్న .... అంటే, ఆయన నా ఊహకందనంతటి వ్యభిచారి."—కూడబలుక్కుంటున్నట్టు ఆమె పలికింది.

"అతను ఇప్పుడెక్కడున్నాడు?"

"తెలీదు.... దేశం మీద పోయి ఎనిమిదేళ్లు దాటింది. మళ్లీ వస్తాడన్న నమ్మకం నాకులేదు." ఆమె మాటల్లో నిబ్బరం చోటు చేసుకొంది.

తర్వాత ఏం మాట్లాడాలో కల్యాణరావుకు తోచలేదు.

ఆమె చెప్పింది "నాకు దాని మీద ఎన్నో ఆశలు....దాన్ని కలెక్టరు చెయ్యాలని ఉంది— ఇప్పటికే దాని కొచ్చే ఆలోచనలు. యింటి దగ్గర నిమిషం ఉండకుండా అది తిరిగే తిరుగుళ్ళు....నాకు భయంగా ఉంది. అది చెడిపోతుంది,"

"మన చేతనయినంత వరకూ ప్రయత్నిద్దాం."

"మీకీ విషయాలన్నీ చెప్పడం మంచిదే అనుకొని చెప్పాను" ఒక్క క్షణమాగి "సిగ్గువిడిచి చెబుతున్నాను....ఆయన వెళ్లిపోయి ఎనిమిదేళ్ళు గడుస్తున్నా నేనింకొకర్ని ఆ దృష్టితో....చూసింది లేదు. కానీ యిది...." మళ్లీ ఆగింది ఆమె.

కల్యాణరావు తలెత్తిచూశాడు.

ఆమె కష్టంమీద పూర్తిచేసింది "యిది....తన మాటల్తో నన్ను




కూడా ఉద్రేకపరుస్తుంది అప్పుడప్పుడూ.''

కల్యాణరావు పైకిలేచి "నేను వెళ్లొస్తాను'' అంటూ చెప్పి వేగంగా అడుగులు వేసుకొంటూ వచ్చేశాడు.

* * *

ఆలోచనలు అలపిపోయి గదినీ, కల్యాణరావు మనసునూ వదిలి వెళ్లిపోయాయి.

వాస్తవంలో కొచ్చిన కల్యాణరావు ముందు భయంకరమైన ప్రశ్నలు వెర్రిభూతాల్లా నిలబడి తిరిగి తిరిగి సూటిగా ప్రశ్నిస్తున్నాయి.

ఆవిడ యశోద గురించి ఆ రకంగా హెచ్చరించినతర్వాత తన మనస్సెందుకు యిలా భ్రమిస్తోంది?

పిచ్చి పట్టినట్టు యశోద అణువణువునూ పరీక్షగా తనెందుకు చూస్తున్నాడు?

యశోద తల్లి ఏ అబ్బాయిల ద్వారానో కూతురు పాడవుతుందని భయపడితే....

తన మనస్సే ఎందుకుఅందుకు పూనుకుంటోంది?

తన చేతులారా తనే యశోదను పాడు చేయాలన్న నీచమైన కోరిక తనలో ఎందుకు కలుగుతోంది?

"లాభం లేదు. ఇలాగేవుంటే యశోదకు ద్రోహం చేసే వాళ్లలో మొదటి వాడు తనే అవుతాడు.'' కల్యాణరావు మనస్సు గొణగ సాగింది.

ఆ రాత్రి కల్యాణరావుకి నిద్రలేదు.

* * *

ఒడ్డు నంతటినీ కబళించి వేస్తుందేమో అన్నంత ఉధృతంగా ఒక కెరటం ఉవ్వెత్తుగా లేచివచ్చి. ఒడ్డును తాకీ తాకగానే విరిగిపోయి తిరిగి చూడకుండా వెళ్లిపోయింది.

ఆ మరుసటి రోజు నుండీ కల్యాణరావు ఉంటున్న ఇంటి వాళ్లు బయట 'టులెట్' బోర్డు తగిలించారు.

ఇంకో కెరటం విరిగిపోయిన కెరటం వంక జాలిగా చూస్తూ పరధ్యానంగా తను ముందు కొచ్చింది.

ఒక కథ అడుగున పడిపోయింది. *